సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.26,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీ గరిష్టంగా రూ.26,500, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



అక్రమాలు కోకొల్లలు

రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమాలు విస్తుగొల్పుతున్నాయి. నదీ జలాల అక్రమ నిల్వతో పాటు పెద్ద ఎత్తున విద్యుత్ చౌర్యానికి పాల్పడిన తీరు అందరినీ విస్మయ పరుస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
37.4°/21.1°

జిల్లా వ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు వేమన ఆలయంలో మహాశక్తి పూజ



వేమన ఆలయం

గాండ్లపెంట: విశ్వకవి యోగి వేమన వార్షిక ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కటారుపల్లిలోని ఆలయంలో ఆదివారం రాత్రి మహాశక్తి పూజ (కుంభం పోయడం) నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతులు చెన్నారెడ్డి, నంద వేమారెడ్డి తెలిపారు. మహాశక్తి పూజతోనే ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని వారు వివరించారు.

బెంగళూరు-కలబురిగి ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురిగి మధ్య ప్రతి శని, ఆదివారాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను 4 వారాల పాటు తిప్పుతున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరు జంక్షన్ నుంచి (06519) ఈనెల 5, 12, 19, 26వ తేదీల్లో రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు కలబురిగి జంక్షన్‌కు రైలు చేరుతుందన్నారు. తిరిగి కలబురిగి జంక్షన్ నుంచి 06,13,20,27వ తేదీల్లో ఉదయం 9.35కు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగుళూరు చేరుతుందన్నారు. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయ రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాదగిరి, షాద్‌నగర్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. 2టైర్, 3ఏసీ, స్లీపర్ క్లాస్‌తోపాటు జనరల్ బోగీలు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్రీడలపైనా ఆసక్తి చూపాలి

- విద్యార్థులకు కలెక్టర్ చేతన్ సూచన



విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకొంటున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి చూపాలని కలెక్టర్ చేతన్ సూచించారు. శనివారం ఆయన ఎనుములపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మోనూ ప్రకారం భోజనం అందుతుందా అంటూ ఆరా తీశారు. క్రీడలవల్ల శరీరదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. తద్వారా చదువుపై దృష్టి పెట్టవచ్చన్నారు. క్రీడల్లో బాగా రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కూడా ఉంటుందన్నారు. అనంతరం వంగదికి వెళ్లి సామగ్రితో పాటు ప్రభుత్వం అందిస్తున్న కోడిగుడ్లు, బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురుగునీరు ఎందుకు నిల్వ ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. మొత్తం వసతి గృహం మరమ్మతు పనులు ఐదురోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ అధికారి శివరంగప్రసాద్, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి బాలాజీ, సంక్షేమ వసతి గృహ అధికారి విజయకుమార్ తదితరులు ఉన్నారు.

కుట్రలకు చరమగీతం

- కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే జిల్లాకు 8న వైఎస్ జగన్ రాక
- పెద్ద ఎత్తున తరలి వచ్చి సంఘీభావం తెలపాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రజల్లో భయం పుట్టించేందుకే కురుబ లింగమయ్య హత్య
- దారుణ ఘటనను అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలి
- లింగమయ్యలా మరో కార్యకర్తకు అన్యాయం జరగకూడదు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పిలుపు
- మాజీ సీఎం పర్యటన ఏర్పాట్లపై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: ''ఫ్యాక్షన్ ఆనవాళ్లే ఉండకూడదని గడిచిన ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. ఈ కుట్రలు, కుతంత్రాలు ఎంతో కాలం సాగవు. చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి' అని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు.టీడీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త కురుబ మజ్జిగ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈనెల 8న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో శనివారం నగరంలోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మాజీ మంత్రి శంకరనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సతీష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8న ఉదయం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో చెన్నేకొత్తపల్లికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా 10 గంటలకు పాపిరెడ్డిపల్లికి చేరుకుని లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతలను కాపాడే అంశంలో తరతమ భేదాలు లేకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు నిత్యకృత్యమయ్యా యన్నారు. కేవలం తమ ఉనికిని కాపాడుకునేందుకు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను హతమార్చడం వారి క్రూర ఆలోచన విధానానికి అద్దం పడుతోందన్నారు. ఎన్నికలకు ముందు అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పది నెలలవుతున్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయలేదని విమర్శించారు.సమావేశంలో మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ కదిరి, మడకశిర నియోజకవర్గాల సమన్వయకర్తలు మక్బూల్‌బాషా, ఈరలక్కప్ప, ఎస్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మీ శ్రీనివాస్, నదీం అహమ్మద్, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, గంగుల భానుమతి, మీసాల రంగన్న, పామిడి వీరా, రంగంపేట గోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

కేసులకు భయపడొద్దు



ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని మనల్ని ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు. పోలీసుల కేసులకు ఎవరూ భయపడొద్దు. నాకు జైలు, బెయిలు కొత్తకాదు. రెండున్నరేళ్ల జైలు జీవితం గడిపా. మహా అంటే కేసులు నమోదు చేస్తారు, లేదంటే రిమాండ్‌కు పంపుతారు. అంతకంటే ఏం చేస్తారు. కార్యకర్తలెవరూ భయపడొద్దు. రాజన్న భక్తులు, జగనన్న సైనికులు 8న పాపిరెడ్డిపల్లికి తరలిరావాలి. చంద్రబాబు చేతిలో మోసపోయిన మహిళలు, నిరుద్యోగులు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున వచ్చి జగనన్నకు సంఘీభావం తెలపాలి. లింగమయ్యదే చివరి రాజకీయ హత్య కావాలి. ఈ ఘటనను అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే నేర వ్యవస్థ రాప్తాడు నియోజకవర్గంలో ఉంది. ఈ సంప్రదాయాన్ని ఇక్కడే అణిచి వేయాలి.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఏమాత్రమూ భయపడే ప్రసక్తేలేదు. మా నాయకుడు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడితే చంద్రబాబు గెలిచిన రోజు నుంచి దౌర్జన్యాలు, అరాచకాలకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పార్టీ శ్రేణులు పోరాడతాయి.

– శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

జెండా కట్టినా కేసుల నమోదు



రాష్ట్రంలో ఎక్కడా ఫ్యాక్షన్ ఉండకూడదని గత ఐదేళ్లలో వైఎస్ జగన్ గట్టి చర్యలు తీసుకున్నారు. ఏ ఒక్క కుటుంబం బలికాకూడదనే ఉద్దేశంతో పోలీసులకు స్వేచ్ఛ కల్పించారు. విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కానీ, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో వైఎస్సార్ సీపీ జెండా కడితే కూడా కేసులు నమోదు చేస్తున్నారు.

– మంగమ్మ, ఎమ్మెల్సీ

అరాచకాలు పేట్రేగిపోయాయి



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో అరాచకాలు పేట్రేగిపోయాయి. స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితిని టీడీపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కల్పించలేదు. స్థానిక సంస్థల స్థానాల్లో ఏమాత్రం బలం లేకపోయినా పోలీసు, రెవెన్యూ అధికారులను అడ్డు పెట్టుకుని కుట్ర చేశారు. ఇందులో భాగంగానే కురుబ లింగమయ్యను హత్య చేశారు. ఎస్పీ దుస్తులను కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు వేసుకుని పోలీసు వ్యవస్థను శాసిస్తున్నారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేను నియోజకవర్గంలో అడుగు పెట్టకూడదంటే పోలీసులు అదే అమలు చేయడం అన్యాయం. ప్రతి కార్యకర్తకు ధైర్యం నింపేందుకే వైఎస్ జగన్ జిల్లాకు వస్తున్నారు.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు

పార్టీ అండగా ఉంటుంది



పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. రామగిరి ఎంపీపీ స్థానాన్ని అక్రమంగా దక్కించుకోవాలని చూసిన టీడీపీ కుట్రను తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తిప్పికొట్టారు.దీన్ని జీర్ణించుకోలేకనే పాపిరెడ్డిపల్లిలో చురుకైన కార్యకర్తను హత్య చేయించారు. రానున్న రోజుల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

– గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

భరోసా కల్పించాలి



వైఎస్ జగన్‌తో కలిసి జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కురుబ లింగమయ్య కుటుంబానికి భరోసా కల్పించాలి. జిల్లాలో ఏ మండలంలోనూ స్థానిక సంస్థల స్థానాల్లో వారికి బలం లేదు. ఎలాగైనా వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్ స్థానాలు లాక్కోవాలనే కుట్రలు, కుతంత్రాలతో దౌర్జన్యాలకు పాల్పడ్డారు.

– శంకరనారాయణ, మాజీ మంత్రి

జగనన్న కోసమే నిలబడ్డారు



కంబదూరు ఎంపీపీ ఎన్నికలో 13 మంది ఎంపీటీసీ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పునపంపారు. వీరిలో 12 మంది మహిళలు. వారిచ్చే డబ్బులు వద్దు... జగనన్న కోసం నిలబడతామని చెప్పి నిరూపించారు. చివరి వరకు ఎన్నిక ఆపాలని అధికార పార్టీ నేతలు కుట్ర పన్నారు. చివరికి జగనన్న కోసమే నిలబడి ఎంపీటీసీలు కుట్రలు తిప్పికొట్టారు.

– తలారి రంగయ్య, మాజీ ఎంపీ

ఈ దారుణాలు ఎప్పుడూ చూడలేదు



పది నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన హింసా రాజకీయాలు ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. ఈ దారుణాలు ఎప్పుడూ చూడలేదని హైకోర్టు న్యాయమూర్తులే ఆశ్చర్యపోతున్నారు. హత్యలు, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రజాభిమానాన్ని కూడబెట్టుకుని వీటిని ఎదుర్కొంటాం. వైఎస్ జగన్‌పై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

సమష్టిగా ఎదుర్కొందాం



కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలను సమష్టిగా ఎదుర్కొందాం. గాండ్లపెంట మండల ఎంపీపీ ఎన్నికలోనూ వైఎస్సార్ సీపీకి ఐదుమంది, టీడీపీకి కేవలం ఇద్దరు సభ్యులున్నా తొలిరోజు అడ్డుకున్నారు. తర్వాత రోజు మా సభ్యులు గైర్హాజరై జరగకుండా చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతోంది.

– మక్బూల్, పార్టీ సమన్వయకర్త, కదిరి

జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివి

- జయంతి వేడుకల్లో కలెక్టర్ చేతన్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దాదాపు మూడు శతాబ్దాల పాటు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శనివారం స్థానిక సాయిఆరామంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ 118 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న ముఖ్యఅతిథులుగా హాజరై అధికారులతో కలసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... విద్యతోనే సమాజంలో అసమానతలు రూపుమాపడం సాధ్యమని నమ్మిన జగ్జీవన్‌రామ్...నిరుపేదల జీవితాల్లో విద్యావెలుగులు నింపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్మిక మంత్రిగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వ్యవసాయ మంత్రిగా కరువు నివారణ చర్యలు చేపట్టి హరిత విప్లవాన్ని ప్రోత్సహించారన్నారు. నవ సమాజ స్థాపనకు జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని, యువత ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నాయకులు సామకోటి ఆదినారాయణ, పెడపల్లి నరసింహులు, యశోద, పంచరత్నమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్‌తోపాటు కుల సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జానపదం.. కళా వైభవం



'సాయి ఇన్ ఎవ్రీ హోం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా తెలంగాణ సత్యసాయి యూత్ సభ్యులు శనివారం పుట్టపర్తికి విచ్చేశారు. ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి అష్టోత్తర శతనామావళి పఠించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. తెలంగాణలోని 10 లక్షల మంది భక్తుల ఇళ్లకు సత్యసాయి చిత్రపటాలను పంపిణీ చేసే 'సాయి ఇన్ ఎవ్రీ హోం' కార్యక్రమాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. సాయంత్రం తెలంగాణ జానపద కళా వైభవాన్ని చాటిచెబుతూ యూత్ సభ్యులు చేసిన నృత్య ప్రదర్శనతో భక్తులు మైమరచిపోయారు.



తెలంగాణ జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న సత్యసాయి యూత్

రెవెన్యూ రాజకీయం!

- ధర్మవరంలో విస్మయం కల్గిస్తున్న రెవెన్యూ అధికారుల వైఖరి
- అభివృద్ధి పనులకు అడ్డంకులున్నా... పట్టించుకోని వైనం
- రాజకీయ నాయకుల కక్ష సాధింపులకే అహర్నిశలు కృషి
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు.. సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



- జిల్లేడు బండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే ధర్మవరం నియోజకవర్గంలో 23 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి..ఈ ప్రాజెక్టుకు ఇంకా 2 వేల ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. నిర్వాసితులకు భూ పరిహారం చెల్లించాల్సి ఉంది. కానీ రెవెన్యూ అధికారులకు తీరిక లేదు.
- ధర్మవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు కదిరిగేట్ వద్ద రూ.50 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆర్‌ఓబీ కింద ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం ఇచ్చేందుకు రూ.30 కోట్లు కూడా విడుదల చేసింది. ఇంకా 23 ఇళ్లకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించేందుకు కూడా రెవెన్యూ అధికారులకు సమయం ఉండటం లేదు.
- బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లోని చిత్రావతి నది పరీవాహక ప్రాంతం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా అవుతోంది. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఎందుకంటే ఈ దందా అంతా కూటమి నేతల కనుసన్నల్లోనే జరుగుతోంది.

...ధర్మవరం నియోజకవర్గంలో రెవెన్యూ ఉన్నతాధికారుల పనితీరుకు పై ఉదాహరణలే నిదర్శనం. మరైతే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారంటే... అధికారంలో ఉన్న కూటమి నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు. వారి సేవలో తరిస్తూ అక్రమాలకు అధికార ముద్ర వేస్తున్నారు. వివాదాస్పద విషయాల్లో తలదూరుస్తూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

ధర్మవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరగానే రెవెన్యూశాఖలోని కొందరు అధికారులు రాజకీయ నేతల్లా వ్యవహరిస్తున్నారు. పోస్టింగ్ ఇప్పించారని కొందరు.. బాగా డబ్బులు ముట్టజెపుతున్నారని మరికొందరు.. చెప్పిన మాట వినకపోతే బదిలీ చేయిస్తారన్న భయంతో ఇంకొందరు రాజకీయ నాయకుల సేవల్లో తరిస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి మద్దతు పలుకుతూ బాధితులకు అన్యాయం చేస్తున్నారు. రస్తా వివాదం ఉందంటే... అధికార పార్టీ సానుభూతిపరులకే ఏకపక్షంగా మద్దతుగా నిలుస్తూ బాధితులకు అన్యాయం చేస్తున్నారు. ఫ్రీ హోల్డ్ జీఓలో నిబంధనలు విస్మరించి మరీ అధికార పార్టీ నేతలకు మేలు చేస్తూ సామాన్యులకు అన్యాయం చేస్తున్నారు. చివరకు కోర్టు పరిధిలోని అంశాల్లోనూ తలదూరుస్తూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

అధికార పార్టీ విమర్శలు..రెవెన్యూ చర్యలు..

రెవెన్యూ యంత్రాంగం అధికార పార్టీ నేతల చేతుల్లో కీలుబొమ్మగా మారిందని చెప్పేందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఫాంహౌస్ వివాదంలో తలదూర్చడమే ఉదాహరణగా చెప్పవచ్చు. ధర్మవరం మండలం తుంపర్తి సమీపంలో నిర్మించిన ఫాంహౌస్ కోసం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అసైన్డ్ భూములు కొనుగోలు చేశారంటూ అధికారపార్టీ నాయకులు ఆరోపిస్తుండగా... వాటిని వాస్తవమని తేల్చేందుకు రెవెన్యూ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఫాంహౌస్ కోసం 40 ఎకరాల అసైన్డ్ భూములు ఆక్రమించారని కూటమి పార్టీల నేతలు కేతిరెడ్డిపై ఆరోపణలు చేశారు. దీనిపై కేతిరెడ్డి ఇప్పటికే పలు మార్లు ఆధారాలతో సహా మీడియా ముఖంగా వివరించారు. దీంతో కూటమి నేతలు తాజాగా 2.50 ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశారంటూ రెవెన్యూ అధికారులతో ఎల్లో మీడియాకు లీకులు ఇప్పించారు. వాస్తవానికి కేతిరెడ్డి తన సోదరుడి సతీమణి గాలి వసుమతి పేరిట 1932లోనే భూయజమాన్య హక్కులు పొందిన రైతుల వారసులతో 25.38 ఎకరాలు మార్కెట్ ధరకు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలను కేతిరెడ్డి గతంలో మీడియాకు చూపించారు. దీంతో ఎలాగైనా కేతిరెడ్డి మీద బురదజల్లాలన్న ఉద్దేశంతో కూటమి నాయకులు తాజాగా 2.50 ఎకరాల అసైన్డ్ భూమిని రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. కానీ ఆ భూమిని నిబంధనలకు లోబడే అధికారులు రిజిస్టర్ చేశారు. ఇదే విషయమై హైకోర్టులో కేతిరెడ్డి పిటిషన్ వేయడంతో కోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అయినా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో కేతిరెడ్డిపైన బురద జల్లేందుకు రెవెన్యూ డివిజన్‌లో ఓ ఉన్నతాధికారి రాత్రింబవళ్లు శ్రమిస్తూ కింది స్థాయి సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. ఇలా నేతల రాజకీయ పనుల కోసం కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సమయం కేటాయించాలని నియోజకవర్గ ప్రజలు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

అక్రమాలు కోకొల్లలు..

సంపాదన కోసం ఆ రియల్టర్ అడ్డదారులు తొక్కాడు. సహజ వనరులను కబ్జా చేశాడు. చుట్టు పక్కల రైతులు ఏమైపోతే నాకేంటి.. తనకు అన్ని సౌకర్యాలూ ఉంటే చాలనుకున్నాడు. పలువురు అధికారుల అండతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డాడు.

- చెలరేగిపోతున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టి
- కొందరు అధికారుల అండదండలతోనే..
- యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం.. నదీ జలాల అక్రమ వినియోగం
- పన్ను చెల్లింపుదారుకు ఉచిత విద్యుత్ వర్తింపు ఏమిటో..?



రెడ్డెప్పశెట్టి అక్రమంగా నిల్వ చేసిన నదీజలాలు



రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్

చిలమత్తూరు: రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమాలు బయటపడుతున్న కొద్దీ విస్తుగొల్పుతున్నాయి. నదీ జలాల అక్రమ నిల్వతో పాటు పెద్ద ఎత్తున విద్యుత్ చౌర్యానికి పాల్పడిన తీరు అందరినీ విస్మయ పరుస్తోంది. అందులోనూ పన్నులు కట్టే వ్యక్తి (ట్యాక్స్‌పేయర్)కి 10 దాకా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉండడం సంచలనం రేపుతోంది. రెడ్డెప్పశెట్టికి కోడూరు సమీపంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో వందల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనికితోడు చుట్టుపక్కల భూములనూ అక్రమంగా అధీనంలో ఉంచుకున్నాడు. ఇందులో 30 పైచిలుకు బోరుబావులు ఉన్నాయి. వివిధ వ్యక్తుల పేరిట వ్యవసాయం కోసమని ఉచిత విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నాడు. అయితే ఆ విద్యుత్‌ను వ్యవసాయానికి కాకుండా ఫ్లోరికల్చర్ – పాలీహౌస్‌లకు వినియోగిస్తున్నాడు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు నెలకు రూ.30 బిల్లు కాగా, ఫ్లోరికల్చర్ వినియోగానికి ప్రత్యేకంగా అనుమతి పొంది యూనిట్‌కు రూ.4.50 చొప్పున బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏడేళ్లుగా వ్యవసాయ కనెక్షన్ల పేరిటే ఫ్లోరికల్చర్ నడుపుతున్నాడు. రియల్టర్ అక్రమాల గురించి 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడంతో అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. క్షేత్రస్థాయి విచారణ చేపట్టి విద్యుత్ చౌర్యాన్ని గుర్తించారు. ఇటీవలే అతనికి నోటీసులు కూడా జారీ చేశారు. దీంతో సదరు రియల్టర్ నష్టనివారణ చర్యలకు ఉపక్రమించి విద్యుత్‌శాఖలోని అధికారులతో ఇప్పటికే మంతనాలు జరిపినట్లుగా విశ్వసనీయ సమాచారం. భారీ విద్యుత్ చౌర్యానికి సంబంధించి రూ.40 లక్షల దాకా జరిమానా విధించాల్సి ఉండగా.. దాన్ని రూ.10 లక్షలకే పరిమితం చేయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఏఈ స్థాయిలో అంతకు మించి ఫైన్ వేసే అవకాశం లేదు. ఉన్నతస్థాయి అధికారులు విచారణ జరిపితే భారీగా జరిమానా పడే అవకాశం ఉంది. ఈ అంశంపై విద్యుత్ శాఖ ఈఈ భూపతిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

నదీ జలాల అక్రమ నిల్వ..

రియల్టర్ రెడ్డెప్పశెట్టి చిత్రావతి నదిపై అనధికారికంగా బ్రిడ్జి నిర్మించి.. నదీ జలాలు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశాడు. ఆ నీటిని విద్యుత్ మోటార్ల సాయంతో నిల్వ ఉంచుకుని తన ఫారం పాండ్లు, పాలీహౌస్‌లు, పూలమొక్కలకు మళ్లించాడు. నదీ పరివాహకంలో ఉండే రైతులు నదీ జలాలపై ఎక్కువగా ఆధారపడతారు. ఇలా ఆదిలోనే అడ్డుకట్ట వేసి జలచౌర్యం చేస్తే దిగువన గల రైతుల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

'సమాజానికి మేలే చేస్తున్నా'

చిత్రావతి నదిపై అనుమతి లేకుండా బ్రిడ్జి నిర్మించడం.. నదీజలాలను అక్రమంగా నిల్వ ఉంచడం.. విద్యుత్ చౌర్యం చేయడం గురించి రియల్టర్ రెడ్డెప్పశెట్టిని 'సాక్షి' విలేకరి ప్రశ్నించగా... తాను సమాజానికి మేలే చేస్తున్నానన్నాడు. తన వల్ల ఏ రైతుకూ నష్టం జరగలేదని చెప్పుకొచ్చాడు. అనవసరంగా పత్రికల్లో రాస్తున్నారంటూ చిందులేశాడు. నీ అంతు చూస్తానని విలేకరిని బెదిరించాడు.

క్లుప్తంగా

వ్యాపార ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న ఐఐపీఎం ప్రొఫెసర్ నరేంద్రన్

గుడిబండ: మహిళా సంఘాల్లోని రైతులకు ఆర్థిక స్వావలంబన, వ్యవసాయ రంగంలో బలోపేతం చేయడం చాలా అవసరమని ఐఐపీఎం ప్రొఫెసర్ నరేంద్రన్ పేర్కొన్నారు. స్థానిక మండల కేంద్రంలోని ఎఫ్‌పీఓ కార్యాలయంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో వ్యాపార ప్రణాళిక, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై మహిళా సంఘాల రైతులకు శనివారం శిక్షణ నిర్వహించారు. ప్రొఫెసర్ నరేంద్రన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను నేరుగా అమ్మకుండా ప్రాసెస్ చేసి, ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో అమ్మితే అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. అనంతరం పండించిన పంటను గ్రేడింగ్ ఏ విధంగా చేయాలి, గ్రేడింగ్ చేసిన పంటను ఏ విధంగా ప్యాకింగ్ చేయాలి, బ్రాండింగ్ ఏ విధంగా ఉండాలి, పంటను నిల్వ ఎలా చేయాలి, బ్రాండింగ్‌కు ప్రచారం ఏ విధంగా చేయాలన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. వెలుగు పథకం ద్వారా స్వయం సహాయక బృందాల మహిళలకు జీవనోపాధిపై ప్రణాళికలు తయారు చేసుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ రసూల్ కోరారు. కార్యక్రమంలో ఏపీఎం తిప్పన్న, ఎఫ్‌పీఓ సీసీ దేవరాజు, మహిళా సంఘాల రైతులు పాల్గొన్నారు.

ఒకే వరుసలో మూడు వాహనాలు ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: దుద్దేబండ మలుపు సమీపంలో శనివారం ఒకే వరుసలో వస్తున్న మూడు వాహనాలు వేగాన్ని అదుపు చేసుకోలేక ఢీకొన్నాయి. కియా స్టేషన్ ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుబవాండ్లపల్లికి చెందిన లావణ్య తన భర్తతో కలసి కియా అనుబంధ పరిశ్రమలో విధులకు ఆటోలో వస్తోంది. మార్గమధ్యంలో దుద్దేబండ మలుపు సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద ఆటోను స్లో చేయడంతో వెనకే వస్తున్న మారుతి కారు ఢీకొంది. అదే సమయంలో వేగంగా వచ్చిన ఐచర్ వాహనం కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లావణ్య, కారులో ప్రయాణిస్తున్న త్రివేణి గాయపడ్డారు. స్థానికులు 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు లావణ్యను అనంతపురం పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో రైతు మృతి



సిద్దప్ప (ఫైల్)

రొద్దం: పొలం పనులు చేస్తున్న రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. కంబాలపల్లికి చెందిన రైతు కురుబ సిద్దప్ప(48), సువర్ణమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. శనివారం ఉదయం సిద్దప్ప మల్బరి తోటలో గుంటక పాస్తుండగా పాము కాటువేసింది. ఏదో పుల్ల గుచ్చుకుందని భావించి అలాగే పనిలో నిమగ్నమయ్యాడు. కొద్దిసేపటి తర్వాత అపస్మారక స్థితిలో ఉడిపోయాడు. అటు వైపు వెళ్లిన కొందరు గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు హుటాహుటిన పెనుకొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మార్గం మధ్యలోనే సిద్దప్ప మృతి చెందినట్లు వైద్యులు వివరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భాగ్యరాజ్ (ఫైల్)

లేపాక్షి: చోళసముద్రం టోల్ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. శనివారం పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన భాగ్యరాజ్ (23) పని నిమిత్తం చిలమత్తూరుకు వెళ్లాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా చోళసముద్రం టోల్‌గేట్ సమీపంలో లేపాక్షి మండలం గలిబిపల్లికి చెందిన నాగరాజు ద్విచక్రవాహనంపై వస్తూ ఎదురుగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో భాగ్యరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజును 1033 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసికరోగి బలవన్మరణం



హనుమంతరాయప్ప (ఫైల్)

పావగడ: కణివేనహళ్ళికి చెందిన మానసిక రోగి హనుమంతరాయప్ప(40) చాకుతో గొంతు కోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సంజీవమ్మ, నారాయణప్ప దంపతుల కుమారుడు హనుమనంతంతరాయప్ప. ఈయనకు భార్య ఈరమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఐదారు నెలలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని ఇంట్లోనే ఉంచి కాపలా ఉండేవారు. అయినా కళ్లుగప్పి పలుమార్లు ఆత్మహత్యకు విఫలయత్నం చేశాడు. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇతర పనుల్లో నిమగ్నమై ఉండగా హనుమంతరాయప్ప తప్పించుకుని ఊరి బయట ఉన్న మొక్కజొన్నతోటలోకి వెళ్లాడు. అక్కడ చాకుతో గొంతు కోసుకుంటుండగా గ్రామస్తులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తుమకూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. సీఐ సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కురుబ లింగమయ్యది రాజకీయ హత్యే

- బీసీ కులాలపై పరిటాల కుటుంబం కక్ష కట్టింది
- వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ ధ్వజం



లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ

సాక్షి, పుట్టపర్తి: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్యది ముమ్మాటికీ రాజకీయ హత్యే అని వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎ. శివ స్పష్టం చేశారు. శనివారం ఆయన లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ పరిటాల కుటుంబం ఆధిపత్యం కోసం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లు రాప్తాడు నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా గడిపారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హత్యా రాజకీయాలు మొదలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక బీసీ వర్గానికి చెందిన లింగమయ్యను దారుణంగా హత్య చేయించారని ఆరోపించారు. లింగమయ్య హత్యలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరో వైపు రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి శ్రీకారం చుట్టి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. రాప్తాడులో పరిటాల రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు, హత్యలు చేస్తున్నారని, ఇవి కొన్నాళ్లే అని, తమ ప్రభుత్వం వస్తే అప్పుడు వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. టీడీపీ నేతలు తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మంత్రి సవిత కురుబ సామాజిక వర్గానికి చెందిన వారే అయినా లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లింగమయ్య కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. త్వరలోనే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఆసీఫుల్లా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు



స్టడీ మెటీరియల్ అందిస్తున్న అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ

- జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ

ఉరవకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే తాను ఐఏఎస్ సాధించానని, ఇష్టంతో కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాలనైనా చేరుకోవచ్చని అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ పేర్కొన్నారు. శనివారం అనంతపురంలోని రోటరీపురం వద్ద సీసీఎల్ క్యాంపస్‌లో ఉరవకొండకు చెందిన నిస్వార్థ ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ సంయుక్తగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు 'సూపర్–60' పేరుతో ఏపీఆర్‌జేసీ, పాలిసెట్, ఆర్జీటీ సెట్‌కు ఉచిత కోచింగ్ ప్రారంభించాయి. జాయింట్ కలెక్టర్ హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో చదవితేనే ర్యాంకులు వస్తాయని అనుకోవడం భ్రమ అని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్ సాధించిన వారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం అభయ ఫౌండేషన్ నిర్వాహకులు స్వామి బాలచంద్ర మాట్లాడుతూ రూ.లక్షల కోసం కాకుండా లక్ష్యం కోసం చదవాలని సూచించారు. పరీక్షల కోసం మాత్రమే శిక్షణ కాదని, శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఇస్తున్నామని చెప్పారు. నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకట్ తాటికొండ మాట్లాడుతూ 2047 వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబుళేసు, నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు చంద్ర, వాణి, రజినీ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మహనీయుడు జగ్జీవన్‌రామ్

జయంతి వేడుకల్లో ఎస్పీ రత్న



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ


పుట్టపర్తి టౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ దేశం గర్వించదగ్గ మహనీయుడని ఎస్పీ రత్న కొనియాడారు. శనివారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్సు హాలులో బాబు జగ్జీవన్‌రామ్ 118 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రత్న ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం అహర్నిశలూ కృషి చేశారన్నారు. సంస్కరణల కోసం పదవులను సైతం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. స్వాతంత్య్ర సమరయోధునిగా, ఉప ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు యువతకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవాన్ని సాకారం చేసిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కిందన్నారు. బిహార్‌లోని అట్టడుగు వర్గంలో జన్మించి రాజకీయంగా అత్యుత్తమ స్థాయికి ఎదిగిన ఘనత జగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

గుత్తి రూరల్: శ్రీపురంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని సర్పంచ్ ఉంద్ర రామలింగమయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన మస్తాన్‌యాదవ్ వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.30వేలు, బొమ్మనహాల్ మండలం గోవిందవాడకు చెందిన గురుస్వామి వృషభాలు రెండవ స్థానంలో నిలిచి రూ.20వేలు, లింగదల్ ఎర్రిస్వామి వృషభాలు మూడో స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి.

వైద్యం.. దైన్యం

- రోడ్డెక్కని వెటర్నరీ అంబులెన్స్‌లు
- కాంట్రాక్ట్ గడువు ముగిసిందని నిలిపివేత
- తక్షణ వైద్య సేవల కోసం ఎదురుచూపు



జేడీఏ కార్యాలయ ఆవరణలో ఆగిపోయిన 1962 మొబైల్ అంబులెన్స్‌లు

అనంతపురం అగ్రికల్చర్: మూగజీవాలకు తక్షణ వైద్య సేవలందించే మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్ వాహనాలు ఇంకా రోడ్డెక్కలేదు. గత ఫిబ్రవరి 16 నుంచి మొదటి విడతగా ఉమ్మడి జిల్లాకు చేరిన 14 వాహనాలు ఎక్కడికక్కడ నియోజకవర్గ కేంద్రాల్లోనే ఆగిపోయాయి. రెండో విడతగా అందుబాటులో ఉన్న మరో 14 వాహనాలు ఈ నెల 15 నుంచి ఆగిపోయే పరిస్థితి ఉందని చెబుతున్నారు. దీంతో 1962 హెల్ప్‌లైన్ కింద మారుమూల ప్రాంతాల్లో సైతం పశువులు, జీవాలు, ఇతరత్రా మూగజంతువులకు అందిస్తున్న విశిష్ట వైద్య సేవలు నిలిచిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 మే 19న దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ల పేరిట అంబులెన్స్‌లు ప్రవేశపెట్టింది. కూటమి సర్కారు వచ్చాక కాంట్రాక్టు గడువు ముగిసిందంటూ నెలన్నర రోజులుగా మొదటి విడత వాహనాలు నిలబెట్టేశారు. త్వరలో రెండో విడత అంబులెన్స్‌లు కూడా ఆపనున్నట్లు తెలుస్తోంది. మనుషులకు 108 అంబులెన్స్‌లు అందిస్తున్నట్లుగా పశువులకు 1962 ద్వారా మొబైల్ అంబులెన్స్‌లు తక్షణ వైద్యసేవలు అందిస్తున్నాయి. దీనికింద పశుసంవర్ధకశాఖ డాక్టర్లు, ఏడీలు సహకారంతో 1962 డాక్టర్లు ఎన్నో అరుదైన కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు చేస్తూ వస్తున్నారు. అలాంటి వాహనాలను నెలల తరబడి ఆపేస్తున్నారు.

పశు వైద్య సేవలకు ఇబ్బందే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశువులు, ఎద్దులు 4,97,102, గేదెలు 2,85,443 ఉన్నాయి. అలాగే గొర్రెలు 49,26,587 ఉండగా మేకల సంఖ్య 8,84,186 ఉన్నాయి. 12,767 పందులు, 25 లక్షల సంఖ్యలో కోళ్లు, 1.57 లక్షలకు పైగా కుక్కలు, అలాగే గాడిదలు, గుర్రాలు, ఇతరత్రా మూగజీవాలు మరికొన్ని ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ లెక్కలు చెబుతున్నాయి. వీటన్నింటికీ తక్షణ వైద్య సేవలు ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెబుతున్నారు.

త్వరలో అందుబాటులోకి

మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్ వాహనాల నిర్వహణకు సంబంధించి కొత్త కాంట్రాక్టు సంస్థ ఖరారైంది. ఈ నెల 15 తర్వాత అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మూగజీవాలకు వైద్య సేవలు పునరుద్ధరణ కానున్నాయి.

– డాక్టర్ జీపీ వెంకటస్వామి, పశుశాఖ జేడీ